
సాక్షి గుంటూరు

మంగళవారం ¦ 17 ¦ జూన్ ¦ 2025



లక్ష నాగవల్లీ దళార్చన

ఫిరంగిపురం:113 తాళ్లూరులోని ప్రసన్నాంజనేయస్వామికి సోమవారం 23 మంది రుత్వికులతో లక్ష నాగవల్లీ దళాలతో అర్చన చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్:నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 513.60 అడుగుల వద్ద ఉంది. ఇది 137.8642 టీఎంసీలకు సమానం.

పోలేరమ్మ తల్లి వార్షికోత్సవం



వెల్దుర్తి:గుండ్లపాడులోని పోలేరమ్మ తల్లి 8వ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు సోమవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని గ్రామ పుర వీధులలో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

న్యూస్‌రీల్

జూలై 5న జాతీయ లోక్‌అదాలత్



గుంటూరు లీగల్: జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టు ప్రాంగణాల్లో జూలై 5న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికళ్యాణ్ చక్రవర్తి సోమవారం తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో గుంటూరు జిల్లావ్యాప్తంగా బెంచెస్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ బెంచెస్ ద్వారా సివిల్ కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇచ్చిన సర్క్యులర్ ప్రకారం కొన్ని రాజీ పడదగ్గ ఎక్సైజ్ కేసులు, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ఎల్‌ఏఓపీ కేసులు, ప్రీ-లిటిగేషన్ కేసులు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కక్షిదారులు, పోలీస్ శాఖ, స్టేక్ హోల్డర్స్ ఈ జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించేలా సహకరించాలని సూచించారు. సివిల్ కేసుల్లో అప్పీల్ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు ఎక్కువగా రాజీ చేసే దిశగా కక్షిదారులకు, న్యాయవాదులకు సూచించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.

ఆర్టీసీ ఆర్‌ఎంగా విమల



పట్నంబజారు (గుంటూరు ఈస్ట్) : ఏపీఎస్ ఆర్టీసీ గుంటూరు జిల్లా రీజియన్ మేనేజర్‌గా సీహెచ్.విమల సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా విజయవాడ హెడ్ ఆఫీసులో పనిచేస్తున్న ఆమెను ఇక్కడ నియమించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఆర్‌ఎంగా పనిచేసిన ఎం.రవికాంత్ డెప్యూటీ సీటీఎంగా బదిలీపై నెల్లూరు వెళ్లారు. విమలను ఆర్టీసీ సిబ్బంది, అధికారులు అభినందించారు.

ఎయిమ్స్ ప్రవేశ పరీక్షలో డాక్టర్ సత్యవేణికి 12వ ర్యాంకు



లబ్బీపేట(విజయవాడ తూర్పు): ఇటీవల ప్రకటించిన ఆల్ ఇండియా ఎయిమ్స్ సర్జికల్ అంకాలజీ సూపర్ స్పెషాలిటీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన డాక్టర్ సత్యవేణి జాతీయ స్థాయిలో 12వ ర్యాంకు సాధించి సత్తా చాటారు. డాక్టర్ సత్యవేణి విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్, ఎంఎస్ పూర్తి చేసి, ప్రస్తుతం నిమ్రా వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఆమె భర్త డాక్టర్ మాచర్ల సృష్టి కూడా జాతీయ స్థాయిలో జరిగిన నీట్ సూపర్ స్పెషాలిటీ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించి బెంగళూరులోని శ్రీ జయదేవ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కార్డియోవాస్కులర్ సైన్స్ అండ్ రీసెర్చ్‌లో వాస్కులర్ సర్జరీ(ఎంసీహెచ్)లో ప్రవేశం పొందారు.

21న యోగాసనాల్లో అందరూ పాల్గొనాలి



గుంటూరు వెస్ట్: ఈనెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న యోగాసనాల్లో వీలైనంత మంది పాల్గొనేలా చేయాలని గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్ నుంచి అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో మాట్లాడారు. యోగాసనాలు వేసేందుకు గ్రామ, వార్డు సచివాలయాల్లో గుర్తించిన 4879 ప్రాంతాలను అధికారులు పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. యోగాంధ్ర-2025లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారందరినీ 21న జరగనున్న కార్యక్రమంలో హాజరయ్యేలా అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. యోగాసనాల శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు పంపిణీ రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు.

31వరకు అతిసారం నియంత్రణపై ప్రచారం

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 16 నుంచి 31వ తేదీ వరకు అతిసార వ్యాధి నియంత్రణపై ప్రచారం నిర్వహించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. తన కార్యాలయంలో సోమవారం ప్రచారానికి సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఐదేళ్లలోపు పిల్లలు అతిసారతో మృత్యువాత పడకుండా ఉండటమే దీని ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి పాల్గొన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు రెడీ!

- 21 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన
- 25 నుంచి కళాశాలల ఎంపికకు వెబ్ ఆప్షన్లు నమోదు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో నాలుగు హెల్ప్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు



ఏప్రిల్ 30న జరిగిన పాలిసెట్‌కు హాజరైన విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి గానూ కౌన్సెలింగ్ ప్రక్రియ ఈనెల 21న ప్రారంభం కానుంది. పాలిసెట్-2025లో అర్హత సాధించిన విద్యార్థులు ఈనెల 28 వరకు జరగనున్న కౌన్సెలింగ్‌లో ర్యాంకుల వారీగా సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాల్సి ఉంది. ఇందు కోసం రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఉమ్మడి గుంటూరు జిల్లాలో నాలుగు హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేసింది.

ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలి



సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకాగోరు విద్యార్థులు ఈనెల 20 నుంచి 27 వరకు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలి. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 చొప్పున క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా ఆన్‌లైన్‌లో రుసుం చెల్లించాలి. సర్టిఫికెట్ల పరిశీలనకు హజరుకాగోరు విద్యార్థులు వెంట ఫీజు రసీదు, హాల్ టికెట్, ర్యాంకు కార్డు, టెన్త్ పాస్ సర్టిఫికెట్, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఓసీ విద్యార్థులు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు తీసుకురావాల్సి ఉంది. స్పోర్ట్స్, గేమ్స్, ఎన్‌సీసీ ప్రత్యేక కేటగిరీలకు చెందిన విద్యార్థులు విజయవాడ బెంజి సర్కిల్ వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో హాజరు కావాల్సి ఉంది.

- ఈనెల 21న ఒకటో ర్యాంకు నుంచి 15వేలు, 22న 15,001 నుంచి 32వేలు, 23న 32,001 నుంచి 50వేలు, 24న 50,001 నుంచి 68వేలు, 25న 68,001 నుంచి 86వేలు, 26న 86,001 నుంచి 1,04,000, 27న 1,04,001 నుంచి 1,20,000, 28న 1,20,001 నుంచి ఆపై చివరి ర్యాంకు వరకు హాజరుకావాలి.
- సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈనెల 25నుంచి 30వ తేదీ వరకు వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొని కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు ఆప్షన్లు ఇచ్చుకోవాలి. కౌన్సెలింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాలకు https // appolycet. ap. gov. in సైట్‌కు లాగిన్ అవ్వాలి.

హెల్ప్‌లైన్ కేంద్రాలు

గుంటూరు నగర శివారు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్, నరసరావుపేట పల్నాడు బస్టాండ్ సమీపంలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీ పాత క్యాంపస్, రేపల్లెలోని ప్రభుత్వ పాలిటెక్నిక్, బాపట్లలోని బాపట్ల పాలిటెక్నిక్ కళాశాలల్లో ఏర్పాటు చేశారు. హెల్ప్‌లైన్ కేంద్రాల్లో ఆయా తేదీల్లో ర్యాంకుల వారీగా సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాల్సి ఉంది.

రేపు గుంటూరు మీదుగా సత్తెనపల్లికి వైఎస్. జగన్

నెహ్రూనగర్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు మీదుగా సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో పర్యటించున్నారని గుంటూరు జిల్లా పార్టీ కార్యాలయం సోమవారం ఓ ప్రకటనలో తెలియజేసింది. 18వ తేదీ ఉదయం 9.30గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి గుంటూరు ఏటుకూరు బైపాస్ సర్వీస్ రోడ్డులోని ఆంజనేయిస్వామి విగ్రహం వద్దకు చేరుకుంటారని పేర్కొంది. అక్కడ నుంచి లాల్‌పురం, కొండా వెంకటప్పయ్య కాలనీ, చుట్టుగుంట సర్కిల్, నల్లపాడు మీదుగా సత్తెనపల్లి చేరుకుంటారని కార్యాలయం తెలియజేసింది.

చంద్రబాబును సపోర్ట్ చేయడం లేదనే కొమ్మినేని అరెస్ట్

మాజీ మంత్రి అంబటి రాంబాబు



నగరంపాలెం (గుంటూరు వెస్ట్): సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్ట్ దురదృష్టకరమని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. జిల్లా జైలు నుంచి సోమవారం రాత్రి విడుదలైన కొమ్మినేనిని అంబటి పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఒక మాట మాట్లాడాలన్నా పదిసార్లు ఆలోచించే వ్యక్తి కొమ్మినేని అని పేర్కొన్నారు. చంద్రబాబుకు సపోర్ట్ చేయడం లేదనే కొమ్మినేనిని అరెస్ట్ చేయించారన్నారు. ఎన్టీవీ నుంచి ఆయనను తొలగించేందుకు ఎంతో ఒత్తిడి తీసుకొచ్చారని మండిపడ్డారు. చివరకు చంద్రబాబు, లోకేశ్ కలిసి కొమ్మినేనిపై తప్పుడు కేసులు పెట్టించారన్నారు. పోలీస్ కస్టడీలో ఉన్నప్పుడు సైతం అతనిపై అమరావతిలో మహిళలతో దాడులు చేయించడం దారుణమని ఖండించారు.

శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా దోహదం



ఏఎన్‌యూ: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో సోమవారం యోగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. వర్సిటీ మెయిన్ గేట్ నుంచి ఇండోర్ స్టేడియం వరకు జరిగిన ర్యాలీలో బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి మాట్లాడుతూ యోగా వ్యక్తుల శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. వర్సిటీ వీసీ కె. గంగాధరరావు మాట్లాడుతూ యోగా మంచి ఆరోగ్యం, మానసిక పరిశుభ్రత, భావోద్వేగ స్థిరత్వాన్ని కాపాడుకోవడంలో మనిషికి సహాయపడుతుందని చెప్పారు. వర్సిటీ రెక్టార్ రత్న షీలామణి మాట్లాడుతూ ఒక వ్యక్తిలో నైతిక విలువలు ఉన్నతస్థాయి చేరడంలో యోగా క్రియాశీల పాత్ర పోషిస్తుందని వివరించారు. వర్సిటీ రిజిస్ట్రార్ జి. సింహాచలం మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 18న వర్సిటీ ప్రధాన క్రీడా మైదానంలో సుమారు 10వేల మందితో వేడుకలు జరుగుతాయని వెల్లడించారు. వరల్డ్ కమ్యూనిటీ సర్వీస్ సెంటర్ కోయంబత్తూర్ వర్సిటీ కో-ఆర్డినేటర్ ఏ.రాధిక వివిధ యోగా అంశాలలో శిక్షణ ఇచ్చారు.కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, యోగాంధ్ర నిర్వాహకులు పి.పి.ఎస్. పాల్ కుమార్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ వెంకటేశ్వర్లు, పరీక్షల కో-ఆర్డినేటర్ రామచంద్రన్, రూసా డైరెక్టర్ ఎస్. మురళీమోహన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ దివ్య తేజ మూర్తి, వసతి గృహాల చీఫ్ వార్డెన్‌లు మల్లికార్జున, మాధవీలతోపాటు వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ వీరయ్య సురేష్ కుమార్, సిద్ధయ్య పాల్గొన్నారు.

వృద్ధులు, మహిళల సమస్యలపై ప్రత్యేక దృష్టి

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



బాధితుల సమస్య ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: మామ వికృత చేష్టలపై, కుటుంబ సభ్యులు మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఉద్యోగం పేరుతో మోసగించారని బాధితులు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు - పరిష్కారాల వ్యవస్థలో ఫిర్యాదు చేశారు. బాధితుల నుంచి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదిదారుల సమస్యలను ఆలకించారు. సంబంధిత సబ్ డివిజన్‌లోని పోలీస్ అధికారులతో మాట్లాడారు. బాధితుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు. మహిళలు, వృద్ధుల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీలు రమణమూర్తి (పరిపాలన), హనుమంతు (ఏఆర్), మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీసీఎస్ డీఎస్పీ శివాజీ కూడా అర్జీలు స్వీకరించారు.

ఉద్యోగం పేరుతో మోసం

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని హైదరాబాద్ చెందిన వ్యక్తి దఫాల వారీగా రూ.4 లక్షలు తీసుకున్నాడు. ఏడాది నుంచి ఉద్యోగం ఇప్పించకుండా తిరుగుతున్నాడు. కనీసం నగదు తిరిగి ఇవ్వాలని అడిగినా పట్టించుకోవడం లేదు. అదేమని అడిగితే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడు. న్యాయం చేయగలరు.

– యు.నాగరాజు, చినబజార్, లాలాపేట

జీవనోపాధికి ఇబ్బంది

సుమారు నలభై ఏళ్లుగా గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట కార్లు నిలుపుదల చేసి బాడుగలకు వెళుతున్నాం. సుమారు 70 కుటుంబాలకు పైగా జీవిస్తున్నాం. అయితే, ఇటీవల విజయవాడ నుంచి పలువురు డ్రైవర్లు బస్టాండ్ వద్ద కార్లు నిలుపుదల చేస్తున్నారు. విజయవాడ వెళ్లేందుకు ఒక్కొక్కరి వద్ద రూ.100 తీసుకుంటున్నారు. అదేమని అడిగితే తమపై దాడులకు దిగుతున్నారు. అంతేగాక తమపై తప్పుడు ఫిర్యాదులను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో చేస్తున్నారు. వారి వల్ల ఆర్టీసీకి సైతం తీవ్ర నష్టం వాటిల్లుతోంది. తమ జీవనోపాధికి ఇబ్బందిగా ఉంది. న్యాయం చేయాలి.

– షేక్ బాజీ, డ్రైవర్లు, గుంటూరు బస్టాండ్

తల్లికి వందనం అమలులో అంగన్‌వాడీలకు అన్యాయం

- కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా
- వెంటనే సంక్షేమ పథకాలు అమలుచేయాలి
- లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్‌లు ముట్టడి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నరసరావుపేట: అంగన్‌వాడీలకు తల్లికి వందనం అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం అన్యాయం చేసిందనీ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.మెటిల్డాదేవి, గుంటూరు మల్లీశ్వరి పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులునాయక్ నాయకత్వంలో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన అంగన్‌వాడీలు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి తమకు తల్లికి వందనంతోపాటు ఇతర సంక్షేమ పథకాలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ పి.అరుణ్‌బాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మెటిల్డాదేవి, మల్లీశ్వరి మాట్లాడుతూ గత ప్రభుత్వం అంగన్‌వాడీలకు అమ్మ ఒడి అందజేసిందన్నారు. అయితే ఈ ప్రభుత్వం అంగన్‌వాడీలకు అన్నీ సంక్షేమ పథకాలు అమలుచేస్తామని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామంటూ హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిందన్నారు. తీరా తల్లికి వందనం అంగన్‌వాడీలకు అమలుచేయకపోవటంతో చాలా మంది టీచర్లు, ఆయాలు రోదిస్తున్నారన్నారు. నెలకు రూ.11వేల జీతం ఇచ్చి సంక్షేమ పథకాలకు ఎగనామం పెడితే ఏవిధంగా బతకాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తల్లికి వందనం, సంక్షేమ పథకాలు అమలు చేయకపోతే రానున్న రోజుల్లో రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్‌లను ముట్టడిస్తామని జిల్లా కార్యదర్శి ఆంజనేయులు నాయక్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంగన్‌వాడీలు యంపరాల సరోజ, కట్టా నాగలక్ష్మి, కోట కోటేశ్వరమ్మ, పేరేచర్ల సాంబ్రాజ్యం, ఉప్పుతోళ్ల వెంకాయమ్మ, కటకం కృష్ణవేణి, మల్లెల శశికళ, వనజాక్షి పాల్గొన్నారు.

కోర్టుల్లో కేసులకు అక్కడే పరిష్కారం

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: కొందరు అర్జీదారులు కోర్టు కేసుల్లో ఉన్న వాటిని పరిష్కరించమని వస్తున్నారని, వాటిని అక్కడే పరిష్కరించుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అర్జీల పరిష్కారంలో సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. కోర్టు కేసులకు సంబంధించి సమాధానాలను నిర్ణీత గడువులోనే దాఖలు చేయాలని చెప్పారు. అవసరమైన మేరకు లీగల్ టీం సహాయం తీసుకోవాలని ఆమె సూచించారు. చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి అధిక సమయం తీసుకుంటున్న అధికారులను గుర్తించామని వెల్లడించారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకు ముందే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు కూడా అర్జీలను స్థానికంగా ఉండే మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయి అధికారులకు ప్రతి వారం ఇవ్వొచ్చని ఆమె సూచించారు. దీంతో సమస్యలు అక్కడే పరిష్కారమవుతాయని తెలిపారు. అనంతరం వచ్చిన 268 అర్జీలను కలెక్టర్‌తోపాటు జేసీ ఏ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీ కుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.

అతిసార వ్యాధిని అరికట్టాలి

జిల్లాలో అతిసార వ్యాధిని పూర్తిగా పారదోలాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 31 వరకు 'డయేరియాను ఆపండి !' క్యాంపైన్‌ను నిర్వహించాలని ఆదేశించారు. ఇందులో భాగంగా వ్యాధిపై ప్రజలకు విస్తృత స్థాయి అవగాహన కల్పించాలని ఆమె తెలిపారు. ఐదేళ్లలోపు చిన్నారులకు ఉచితంగా రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 14 జింకు మాత్రలు పంపిణీ చేయాలని చెప్పారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఆశా వర్కర్లు, ఏఎన్ఎంల ద్వారా మాత్రలు పంపిణీ చేయాలని ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం అతిసార వ్యాధి నిర్మూలనపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేసీ భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీ కుమారి, జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రావణ్ బాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తీసుకోని రుణాలకు నోటీసులు

నల్లపాడులోని జీడీసీసీ బ్యాంకులో యానిమేటర్ కె.భవ్యశ్రీతో పాటు మరికొందరు 2021–23 సంవత్సర మధ్య కాలంలో రూ.4.30 కోట్లు రుణాలు తీసుకున్నారు. బ్యాంకుల్లో మా పేర్లు ఉన్నాయి. ఇటీవల మేము కట్టాలని బ్యాంకు నోటీసులు జారీ చేసింది. తీసుకోని రుణాలకు మేము ఎందుకు కట్టాలి? అయినా బ్యాంకు అన్ని కోట్లు ఎలా ఇచ్చింది? దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలి.

–బాధిత మహిళలు

మురుగుతో తాగునీరు కలుషితం



గుంటూరు రూరల్ మండలం, జొన్నలగడ్డ మంచినీటి చెరువులోకి గోరంట్ల పరిధిలో కొన్ని ప్రాంతాల నుంచి మురుగు చేరుతోంది. దీంతో తాగునీరు కలుషితమవుతోంది. చిన్న పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారు. గ్రామంలో సుమారు 10 వేల మందికి ఇదే మంచినీటి వనరు. అధికారులు పరిశీలించి తక్షణం చర్యలు తీసుకోవాలి.

–ఇమ్మడి రామారావు, జె.కోటిరెడ్డి, జిల్లా రైతు సంఘం నాయకులు.

ఉపాధ్యాయ బదిలీల్లో 5,147 మందికి స్థాన చలనం

బదిలీ అయిన పాఠశాలల్లో చేరిన ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో అన్ని కేటగిరీల్లో కలిపి 5,147 మంది ఉపాధ్యాయులకు స్థాన చలనం కలిగింది. 105 మంది గ్రేడ్-2 హెచ్‌ఎంలతో పాటు మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు 341, స్కూల్ అసిస్టెంట్లు-1,986, ఎస్జీటీలు-2,615, భాషా పండిట్లు-54, పీఈటీలు 26, ఆర్ట్, క్రాఫ్ట్, డ్రాయింగ్, ఒకేషనల్ టీచర్లు 20 మంది చొప్పున వేర్వేరు పాఠశాలలకు బదిలీపై వెళ్లారు. లాంగ్ స్టాండింగ్ విభాగంతో పాటు రిక్వెస్ట్ బదిలీపై స్థాన చలనం పొందిన ఉపాధ్యాయులు విద్యాశాఖ ఉత్తర్వుల ప్రకారం తాము పని చేస్తున్న పాఠశాలల్లో రిలీవ్ అయ్యి, బదిలీ అయిన పాఠశాలల్లో సోమవారం విధుల్లో చేరారు.

బదిలీలతో ప్రభావితమైన పాఠశాలల్లో ఉపాధ్యాయులు 50 శాతం కంటే తక్కువగా ఉన్నచోట, బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లిన వారిని తిరిగి, పాత పాఠశాలల్లోనే కొనసాగే విధంగా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. సంబంధిత పాఠశాలల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేసే వరకు బదిలీ అయిన ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లోనే విధులు నిర్వహించాల్సి ఉండగా, విద్యాశాఖ ఆదేశాలపై ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని బాలిక మృతి



చిలకలూరిపేట టౌన్: ఆర్టీసీ బస్సు ఢీకొని చిన్నారి మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. వైఎస్సార్ కాలనీకి చెందిన గాలేటి రాంబాబు, కావేరి దంపతులు, వారి మేనకోడళ్లు పాముసాని బాలసాహితి, వెంకట శృతితో కలిసి బైక్‌పై కనపర్రు చర్చికి వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. లింగంగుంట్ల వంతెన దాటిన తరువాత అదే మార్గంలో ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ట్యాంక్‌పై కూర్చున్న వెంకట శృతి(9) బస్సు చక్రాల కింద పడడంతో తీవ్రంగా గాయపడింది. రాంబాబు, భార్య కావేరికి స్వల్ప గాయాలు కాగా, మరో బాలిక బాల సాహితికి గాయాలు కాలేదు. వెంటనే పాపను చికిత్స నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినప్పటికీ, తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందింది.

మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)



వచ్చిన బస్తాలు	54,117
అమ్మకాలు	51,956
నిల్వ	6,027

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,500
నంబరు-5	10,000-13,000
273	10,000-12,400
341	10,000-13,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,800-13,400
నంబరు-5	10,000-13,500
341	10,000-13,800
సూపర్ -10	10,000-13,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,500 - 14,200
బాడిగ-355	10,000 - 13,000
దేవనూరు డీలక్స్	10,000 - 13,000
ఆర్మూర్	9,800 - 11,200
తాలుకాయలు	5,000-6,900

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,500
బాడిగ-355	10,000 - 13,400
దేవనూరు డీలక్స్	10,000 - 13,800
తాలు	5,000 - 7,000

-కొరిటిపాడు (గుంటూరు)



పసుపు ధరలు
(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : **928**

కొమ్ములు : **596** బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,600	10,275	10,200

కాయలు : **174** బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,600	10,300	10,200

మొత్తం అమ్మకాలు : **696.00** క్వింటాళ్లు

-దుగ్గిరాల

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **1,200** గరిష్ఠం : రూ. **1,800**

మోడల్ ధర రూ. **1,500**

సూపర్ సిక్స్‌లోని ప్రతి పథకాన్ని అమలు చేస్తాం

నరసరావుపేట: సూపర్ సిక్స్‌లోని ప్రతి పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వెల్లడించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం పారదర్శకంగా తల్లికి వందనం పథకాన్ని అమలు చేసిందని పేర్కొన్నారు.



నయవంచనలో ఘనుడు చంద్రబాబు

- వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ
- కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సంక్షేమం శూన్యం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అంబటి మురళీకృష్ణ, నాయకులు

పొన్నూరు: ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ విమర్శించారు. పొన్నూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం కూటమి ఏడాది పాలనలో రాష్ట్ర ప్రజలకు చేసిన మోసాలపై వైఎస్సార్ సీపీ ప్రచురించిన 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని ఆయన పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ అధికారంలోకి రావాలని నోటికొచ్చిన అబద్ధపు హామీలిచ్చి సీఎం చంద్రబాబు, కూటమి నేతలు ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ఒక్క హామీని కూడా అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. ఎన్నికల సమయంలో మాజీ సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పథకాల కంటే రెండింతలు ఇస్తానని చెప్పి, అందరినీ వంచించిన ప్రజాద్రోహి చంద్రబాబు అని మండిపడ్డారు. కూటమి పాలకులు సాగిస్తున్న అరాచక పాలనపై ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయని హెచ్చరించారు. కూటమి ఆకృత్యాలను ఎండగట్టేలా వైఎస్సార్‌సీపీ పోరాటాలు ఉంటాయని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలతో కలిసి పని చేస్తానని తెలిపారు. ఇకపై ప్రతి వారంలో రెండు గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో సమావేశం అవుతానని చెప్పారు.కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో బూటకపు హామీలతో ప్రజలకు చేసిన మోసాలకు నిరసనగా పొన్నూరులో నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి వేలాది మంది జనం తరలివచ్చి ప్రభుత్వంపై వ్యతిరేకతను తెలియజేశారని వివరించారు. ఈ నెల 18వ తేదీన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామానికి వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్న సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు పెదకాకాని మండలం ఆటోనగర్ సమీపంలో శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకే నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొని జననేత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలకాలని మురళీకృష్ణ కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ భవనం పద్మలీల, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ రూత్ రాణి, అధికార ప్రతినిధి వెంకట సుబ్బయ్య, నాయకులు అంబటి వెంకటేశ్వరరావు, వట్టిప్రోలు రంగారావు, షేక్ మాము, చింతలపూడి మురళీకృష్ణ, బొనిగల రాజారావు, ఈశ్వరయ్య, సుషోభిత, దేవరకొండ గోపి, మూర్తి రాజు, అంబటి రాఘవయ్య, ఎల్. పిచ్చిరెడ్డి, చేబ్రోలు, పెదకాకాని మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నూరిఫాతిమా, నేతలు

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు

పట్నంబజారు: రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, కూటమి సర్కార్ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆమె కార్యాలయంలో సోమవారం 'జగన్ అంటే నమ్మకం - చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ సంక్షేమమంటే గుర్తుకు వచ్చేది మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేరు మాత్రమేనని తెలిపారు. వెన్నుపోటు, మోసం అంటే గుర్తుకు వచ్చేది చంద్రబాబు పేరు అన్నారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం, చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేస్తే, కూటమి సర్కార్ ఏడాది పాలనలో కక్షలు, కార్పణ్యాలు తప్పా ఏ ఒక్కటీ అమలు కాలేదని తెలిపారు. రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారం రాష్ట్రంలో 759 అక్రమ కేసులు వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలపై పెట్టారని ధ్వజమెత్తారు. చివరకు సిగ్గులేకుండా శిలాఫలకాలు, దేశంలోనే అత్యంత అద్భుతమైన విజయవాడలో ఆవిష్కరించిన అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉన్న జగనన్న పేరును తొలగించడం దారుణమని ఖండించారు. దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాలు తగులబెడుతున్నారని, వీటి వల్ల కూటమి నేతలు పాపం మూటగట్టుకోవడమేనని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ నేతలు నందేటి రాజేష్, శేషగిరి పవన్, కీశర సుబ్బారెడ్డి, రాజేష్, జాఫర్, షంషేర్, రామయ్య, ఆదినారాయణరెడ్డి, పార్టీ నేతలు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసి'డర్' చంద్రబాబు


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు, నేతలు

మంగళగిరి: ప్రపంచంలో వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రమేనని వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ధ్వజమెత్తారు. నగర పరిధిలోని ఆత్మకూరులో గల పార్టీ కార్యాలయంలో సోమవారం 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి, హనుమంతరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు పెట్టి వేధించడం తప్పా సంవత్సర కాలంలో ప్రజలకే ఏమి చేసిందని ప్రశ్నించారు. రూ.1,50,000 వేల కోట్లు అప్పు చేసిన చంద్రబాబు ఆ డబ్బులతో ప్రజలకు ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. పేద ప్రజల్ని ఎన్నికల్లో సూపర్ సిక్స్ అంటూ మోసం చేసిన చంద్రబాబు కనీసం తల్లికి వందనాన్ని అర్హులైన వారికి అందజేయకుండా నిలువునా ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదు సంవత్సరాల పాలనలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలను ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. కార్యక్రమంలో అనుబంధ సంఘాల నాయకులు తాడిబోయిన శివగోపయ్య, బుర్రముక్క వేణుగోపాలస్వామిరెడ్డి, నాలి వెంకట కృష్ణ, ఆకురాతి రాజేష్, ఈదులమూడి డేవిడ్‌రాజు, మాజీ ఎంపీపీ పచ్చల రత్నకుమారి, సంకె సునీత, వేల్పుల ఎలీషా, మల్లవరపు సుధారాణి, బొక్కా అగస్టీన్, మేడా వెంకటేశ్వరరావు, శ్రీనివాసరాజు, సుబ్బారావు, కృష్ణమూర్తి, ధనుంజయరావు, జంగా నాగిరెడ్డి, శరణ్‌కుమార్‌రెడ్డి, ముదిగొండ ప్రకాష్, మల్లికార్జునరెడ్డి, గుంజి షణ్ముఖ, జావిద్ పాల్గొన్నారు.

జగన్ అంటే నమ్మకం... చంద్రబాబు అంటే మోసం

వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు


పుస్తకావిష్కరణ చేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు, నాయకులు

తాడికొండ: 'జగన్ అంటే నమ్మకం... చంద్రబాబు అంటే మోసం' అని మోసమని రాష్ట్ర ప్రజలకు పూర్తిగా అర్థమైందని తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు అన్నారు. గుంటూరు మల్లికార్జునపేటలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'జగన్ అంటే నమ్మకం ... చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఐదు కోట్ల ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలు ఇస్తానని అబద్ధపు హామీలిచ్చిన చంద్రబాబు ఏడాదిలో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్‌గా చంద్రబాబు పాలన ఉందని విమర్శించారు. అధికారంలోకి వచ్చేందుకు వేలాది హామీలిచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను నిలువునా దగా చేశారని మండిపడ్డారు. ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న పోరాటాల ఫలితంగా నేడు తూతూమంత్రంగా ఒకటి, రెండు పథకాలు అమలు చేసి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. నేడు కూటమి ప్రభుత్వం ఆడలేక మద్దెల ఓడు అనే చందంగా అర్హులకు కూడా పథకాలు అందించలేక చేతులెత్తేసి ప్రజలను సచివాలయాల చుట్టూ తిప్పుతోందని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని, ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలపై ఇష్టానుసారంగా కేసులు పెట్టి భయపెట్టేలా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. చంద్రబాబు పాలనను ప్రజలు గమనిస్తున్నారని, ఆయనకు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో స్థానిక సంస్థలతో పాటు సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడొచ్చినా కూటమి ప్రభుత్వం డిపాజిట్లు లేకుండా గల్లంతవడం ఖాయమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు ముప్పాళ్ల మనోహర్, మైనేని నాగమల్లేశ్వరరావు, తాళ్లూరి వంశీ, మార్పుల శివరామిరెడ్డి, చేవూరి రామ్మోహనరెడ్డి, కొప్పుల శేషగిరిరావు, చుండు వెంకటరెడ్డి, ఆరేపల్లి జోజి, డీజే శ్రీనివాసరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి ఏడాది వైఫల్యాలపై పుస్తక ఆవిష్కరణ


కార్యక్రమంలో ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: ఎన్నికల సమయంలో అమలు కాని హామీలను ఇచ్చి నేడు అన్నీ చేశామంటూ చంద్రబాబు ప్రజలను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం ఏటుకూరు నియోజకవర్గ కార్యాలయంలో కూటమి ప్రభుత్వ ఏడాది వైఫల్యాలపై వైఎస్సార్‌సీపీ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న బలసాని మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రజలకు ఎటువంటి సంక్షేమాన్ని అందించకపోయినా అంతా చేసేశాను.. సూపర్ సిక్స్ ఇచ్చేశాను.. అంటూ పచ్చమీడియాలో ప్రచారం చేసుకోవటం పరిపాటిగా మారిందన్నారు. అందుకే జగనన్న అంటే నమ్మకమని.. చంద్రబాబును నమ్మితే మోసమేనని చెప్పారు. గ్రామ స్థాయిలో ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడు కూటమి ప్రభుత్వం కుట్రలను, వైఫల్యాలను ప్రజలకు తెలియజేసి గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషిచేయాలని కోరారు. అనంతరం పుస్తకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బాలుడిపై లైంగిక దాడి

తాడేపల్లి రూరల్ : తాడేపల్లిలోని డోలాస్‌నగర్‌లో జరిగిన లైంగిక దాడి సంఘటన ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం.. డోలాస్‌నగర్‌లో మైనర్ దివ్యాంగుడు తన ఇంటి పక్కనే ఉండే మరో ఏడేళ్ల బాలుడిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆదివారం శరీరంపై వెనుక భాగంలో గాయాలు కావడంతో బాగా నొప్పిగా ఉందని బాలుడు ఏడవడంతో ఏమైందని తల్లిదండ్రులను అడగ్గా విషయం చెప్పాడు.దీనిపై మైనర్ దివ్యాంగుడి తల్లిదండ్రులను ప్రశ్నించగా దాడి చేశారంటూ బాలుడు తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో మైనర్ దివ్యాంగుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. బాలుడిని పరీక్షల నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. మైనర్ దివ్యాంగుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. జరిగిన సంఘటనపై తాడేపల్లి పోలీసులను వివరణ కోరగా.. సంఘటనపై ఆదివారం రాత్రి కేసు నమోదు చేశామని చెప్పారు.

పోలీసు శాఖకు 33 అధునాతన మోటారు సైకిళ్లు కేటాయింపు

పచ్చ జెండా ఊపి ప్రారంభించిన జిల్లా ఎస్పీ


నూతన బైక్ నడుపుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: సురక్షితమైన డ్రైవింగ్ ప్రతి ఒక్కరి ప్రాణాలను కాపాడుతుందని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు కేటాయించిన మూడు బుల్లెట్లు, 30 అపాచీ ద్విచక్ర వాహనాలను సోమ వారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. జిల్లా ఎస్పీ ఓ బైక్‌ను కొద్ది దూరం నడిపారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. రోడ్డు భద్రతా ప్రమాణాల నిర్వహణ కోసం సరికొత్త బైక్‌లతో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారని పేర్కొన్నారు. ఆధునికమైన సాంకేతికతతో కూడిన సిగ్నలింగ్ వ్యవస్థ ఉందన్నారు. ఈ వాహనాలపై సుశిక్షితులైన పోలీస్ సిబ్బందితో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహణకు ప్రణాళికలు రూపొందించామన్నారు. గుంటూరు నగరం, తుళ్లూరు, తాడేపల్లి, తెనాలి, మంగళగిరి, పొన్నూరు పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామని చెప్పారు. రహదారులపై వచ్చే, పోయే ఇతరుల వాహనాలకు ఇబ్బందులు కలిగించేలా అడ్డదిడ్డమైన డ్రైవింగ్, రేసులను అరికట్టేందుకు పెట్రోలింగ్ చేపడతామని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు జరిగినా లేదా ట్రాఫిక్ సమస్య తలెత్తిన సత్వరమే పరిష్కరించేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీలు రమణమూర్తి (పరిపాలన), హనుమంతు (ఏఆర్), ట్రాఫిక్ డీఎస్పీ రమేష్, ఎస్‌బీ సీఐ అళహరి శ్రీనివాస్, ఎస్పీ సీసీ ఆదిశేషు, పశ్చిమ ట్రాఫిక్ పీఎస్ సీఐ సింగయ్య, ఆర్‌ఐలు శ్రీహరి రెడ్డి, శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఏపీ టాక్స్ బార్ అధ్యక్షుడిగా రామరాజు శ్రీనివాసరావు



గుంటూరు వెస్ట్ : ఏపీ టాక్స్ బార్ రాష్ట్ర అధ్యక్షుడిగా గుంటూరుకు చెందిన ప్రముఖ ఆడిటర్ రామరాజు శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ప్రస్తుత అధ్యక్షుడు ఎం.వి.జె.కె. కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు జిల్లాలో ఈ నెల 15న జరిగిన ఎన్నికల్లో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. జూలై 1 నుంచి పూర్తి బాధ్యతలు స్వీకరిస్తారన్నారు. ఈ పదవిలో రెండు సంవత్సరాలు పాటు కొనసాగుతారన్నారు. 2000 పైగా ప్రాక్టీషనర్స్, చార్టెర్డ్ అక్కౌంటెంట్స్, న్యాయవాదులు ఈ సంస్థలో సభ్యులుగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. శ్రీనివాసరావు గతంలో ఏపీ టాక్స్ ప్రాక్టీషనర్స్, కన్సల్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ (సదరన్) చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారన్నారు. పలు సేవా కార్యక్రమాల్లో ఆయన చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. శ్రీనివాసరావు రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపిక కావడం సంస్థకు ఎంతో ప్రయోజనమని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయనకు కోట సునీల్, ఏ.వి.ఎస్. కృష్ణ మోహన్, చక్ర రమణ, ఫణి కుమార్, సురేష్‌లతోపాటు పలువురు ఆడిటర్లు, చార్టెర్డ్ అక్కౌంటెంట్లు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యుడు మృతి

యువతికి తీవ్ర గాయాలు


వెంకటేష్ మృతదేహం

తెనాలి రూరల్: రోడ్డు ప్రమాదంలో వైద్యుడు మృతి చెందగా, యువతి తీవ్ర గాయాలపాలైన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన వైద్యుడు బూదాటి వెంకటేష్(35) తెనాలి ప్రభుత్వ వైద్యశాలలోని డయాలసిస్ విభాగంలో పని చేస్తున్నాడు. విజయవాడకు చెందిన స్నేహితురాలు యామినీని తెనాలి నుంచి విజయవాడకు తీసుకెళ్లేందుకు బుల్లెట్‌పై బయలుదేరారు. వీఎస్సార్ కళాశాల దాటగానే తెనాలి-విజయవాడ రహదారిపై ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేసే క్రమంలో ట్రెయిలర్ ఢీకొని ఇద్దరూ తీవ్ర గాయాలపాలయ్యారు. తెనాలిలోని ప్రైవేటు వైద్యశాలకు ఇద్దరిని తరలించగా, వెంకటేష్ అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. అపస్మారస్థితిలో ఉన్న యామినికి చికిత్స అందిస్తున్నారు. రూరల్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హాట్సాఫ్ డాక్టర్ !

- మానవత్వం చాటుకున్న డాక్టర్ రాఘవ శర్మ
- నిడమానూరు బైపాస్‌లో రోడ్డులో ప్రమాదం
- తీవ్ర గాయాలతో పడిఉన్న వ్యక్తి
- వెంటనే భుజాలపై తీసుకుని కారులోకి తీసుకెళ్లిన డాక్టర్
- ప్రమాదం నుంచి బయటపడిన బాధితుడు


బాధితుడికి సీపీఆర్ చేస్తున్న డాక్టర్ రాఘవశర్మ

గుంటూరు మెడికల్ : ఆదివారం రాత్రి ఎనిమిది గంటల సమయం.. నిడమానూరు బైపాస్.. రాత్రి పూట చిమ్మ చీకట్లో నెత్తుటి మడుగులో స్పృహ లేకుండా పడి ఉన్న భర్తను చూసి ఆమె గుండెలు బాదుకుంటోంది. అయ్యా.. కాపాడండి ! అంటూ కన్నీరుమున్నీరవుతోంది. అప్పటికే కొన్ని వందల వాహనాలు అటు ఇటు పరుగులు పెడుతున్నా ఆగలేదు. ఇంతలో గుంటూరుకు చెందిన సీనియర్ కార్డియాలజిస్ట్, లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ పి.వి.రాఘవశర్మ గన్నవరం నుంచి గుంటూరు వస్తున్నారు. రోడ్డు పక్కన దూరంగా పడి ఉన్న బాధితుడు, ఆర్తనాదాలు పెడుతున్న ఆయన భార్య కనిపించారు. వెంటనే కారు ఆపి పరుగు పరుగున అక్కడకు వెళ్లారు.బాధితుడి నాడి పట్టుకున్న వెంటనే మరికొద్ది క్షణాలు మాత్రమే ఊపిరి ఉంటుందని అర్థమైంది. వెంటనే భుజాలపై వేసుకుని ఒక్క ఉదుటున కారు వద్దకు వెళ్లారు. అప్పటి వరకు గుండెల నిండా కన్నీళ్లతో.. అంతులేని దిగులు చీకట్లలో కూరుకుపోయిన ఆ ఇల్లాలు.. వణుకుతున్న తన రెండు చేతులు జోడించి.. అయ్యా దేవుడిలా వచ్చారు! అంటూ దణ్ణం పెట్టింది. వేగంగా బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం నుంచి బయటపడ్డాడు. డాక్టర్ రాఘవశర్మ మానవత్వపు వైద్య సేవలకు అక్కడ ఉన్న ప్రజలు, పోలీసులు 'హాట్సాఫ్ డాక్టర్ !' అంటూ సలాం కొట్టారు.

